శిథిలావస్థలో భద్రాచలం తహసీల్

- బ్రిటీష్ కాలం నాటి కట్టడం
- వర్షం వస్తే తడుసుడే..
- ఇబ్బందిపడుతున్న సిబ్బంది, ప్రజలు



ధ్వంసమైన థర్మాకోల్ సీలింగ్



కూలిపోయే స్థితిలో ఉన్న భవనంలోని గది



కురుస్తున్న భవన వరండా ప్రదేశం

భద్రాచలంటౌన్: ఉమ్మడి రాష్ట్రంలో అతి పెద్ద నియోజకవర్గానికి కేంద్రంగా ఉన్న భద్రాచలం తహసీల్దార్ కార్యాలయం ఒకప్పుడు ఒక వెలుగు వెలిగింది. బ్రిటీష్ కాలంలో అప్పటి ప్రభుత్వం 1912వ సంవత్సరంలో నిర్మించిన పెంకుల భవనానికి 100 ఏళ్లు దాటింది. ప్రస్తుతం భవనం శిథిలావస్థకు చేరడంతో ఇందులోని సిబ్బంది కార్యకలాపాలు నిర్వహించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పెంకులతో నిర్మించిన ఈ భవనం ఇప్పటికే 70 శాతం కూలిపోయ్యే పరిస్థితిలో ఉంది. మిగిలిన రెండు గదుల్లో ఒకటి తహసీల్దార్‌కు కేటాయించగా మరో గదిలో సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. వర్ష కాలం వచ్చిదంటే సిబ్బందితో పాటు వివిధ పనులపై కార్యాలయానికి వచ్చిన ప్రజలు వానలో తడవాల్సిన పరిస్థితి. అనేక మంది అధికారులు భవనానికి మరమ్మతులు చేయించారే తప్ప మరో నూతన భవన నిర్మాణానికి ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు పంపిన దాఖాలు లేవని తెలుస్తోంది. ఎప్పుడు ఏ పెచ్చూడి పడుతుందో తెలియక బిక్కుబిక్కుమంటూ కార్యాలయ అధికారులు, సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు.

ఉమ్మడి రాష్ట్రంలో కళకళ..

ఉమ్మడి రాష్ట్రంలో భద్రాచలం తహసీల్దార్ కార్యాలయం ఎనిమిది రెవెన్యూ గ్రామాల ప్రజల రాకపోకలతో నిత్యం కళకళలాడుతుండేది. విభజన తర్వాత భద్రాచలం పట్టణం మినహాయించి మిగత గ్రామాలు మొత్తం ఏపీలో కలిసి పోయాయి. దీంతో భద్రాచలం మండలం తహసీల్దార్ కార్యాలయ పూర్తిగా ఉనికి కోల్పోయింది. అప్పటి నుంచి కార్యాలయ భవనాల గురించి పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. మరో భవనంలోకి మార్చే పరిస్థితి లేకపోవడంతో అందులోనే కాలం వెల్లదీస్తున్నారు.

తాత్కలిక మరమ్మతులతో సరి..

తహసీల్దార్ కార్యాయలం పెంకుల పెచ్చులు ఊడుతున్న క్రమంలో ఐదేళ్ల క్రింతం థర్మకోల్ షీట్స్‌తో సీలింగ్ చేయించారు. కానీ వర్షాకాలం వచ్చింటే కురుస్తుండడంతో సీలింగ్ సైతం పాడైపోయింది. వర్షాకాలం రికార్డులతో పాటు కంప్యూటర్లను కాపాడుకోవడానికి తలప్రాణం తోకకి వస్తోందని సిబ్బంది వాపోతున్నారు.

సమీకృత భవనం అవసరం

భద్రాచలం మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు దాదాపు అన్ని శిథిలావస్థకు చేరుకున్నాయి. పట్టణంలో ఖాళీ ప్రభుత్వ భూములు ఉన్న నేపథ్యంలో అన్ని కార్యాలయాలు ఒకే చోట ఉండే విధంగా సమీకృత భవనం నిర్మించాలనే వాదనలు మండల ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. పూర్వం నిర్మించిన భవనాలు కావడంతో పట్టణంలో ఒక్కొటి ఒక చోట ఏర్పాటు చేశారు. దీంతో ప్రజలు తమ సమస్యలను పరిష్కారం కోసం తిరిగేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఉన్నతాధికారులు ఆ దిశగా ఆలోచన చేసి అన్ని కార్యాలయాలు ఒకే చోట ఉండే విధంగా సమీకృత భవనం నిర్మాణం చేప్పటాలని ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బందులు తప్పడం లేదు..

కార్యాలయ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. వర్షం వచ్చిందంటే ముఖ్యమైన రికార్డులను భద్రపరచడానికి తిప్పటు తప్పడం లేదు. మరమ్మతులు సైతం చేయలేనంతగా భవనం దెబ్బతిన్నది. విధులు నిర్వహించేందుకు సిబ్బంది సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

– నరసింహారావు, ఆర్ఐ

పోడు రైతులకు ప్రోత్సాహకం

- పశువులు, జీవాల పెంపకానికి కేంద్రం రాయితీలు
- పీఎం జనజాతి గౌరవ ఉద్ధరణ అభియాన్ కింద లబ్ధి



పోడు సాగు చేసుకుంటున్న గిరిజన రైతులు

బూర్గంపాడు: పోడు భూములు సాగు చేసుకునే రైతులకు కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహకాలను అందించనుంది. పంటల సాగుతో పాటుగా పశువులు, జీవాల పెంపకానికి కేంద్రం తోడ్పాటునందిస్తుంది. అటవీ హక్కుల చట్టం కింద ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాలు పొందిన గిరిజన రైతులకు గేదెలు, మేకలు, పందులు, నాటు కోళ్ల పెంపకానికి 90శాతం రాయితీని అందించనుంది. ప్రధానమంత్రి జనజాతి గౌరవ ఉద్ధరణ అభియాన్ పథకంలో పోడు భూములు సాగు చేస్తున్న గిరిజన రైతులకు ఈ పథకం వర్తిస్తుంది. నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ పథకాన్ని వర్తింపజేయనున్నారు.

రాయితీలు ఇలా..

ఈ పథకంలో పశువులు, మేకల పెంపకానికి రూ.1లక్ష, రూ.50వేలు చొప్పున రెండు కేటగిరీలలో 90శాతం రాయితీని అందిస్తారు. అదేవిధంగా కోళ్లు, కోడిగుడ్ల యూనిట్‌కు రూ.50వేల వరకు, రూ.25వేల వరకు రెండు కేటగిరిలలో 90శాతం రాయితీతో పథకాన్ని వర్తింపజేస్తారు. పందుల పెంపకానికి 90శాతం రాయితీతో రూ.60వేల వరకు పథకాన్ని వర్తింపజేస్తారు. ఈ పథకంతో లబ్ధిపొందాలనుకునే పోడుభూములకు పట్టాలున్న ఆదివాసీ గిరిజన రైతులు స్థానిక ప్రభుత్వ పశువైద్యశాలల్లోని వెటర్నరీ ఆఫీసర్‌ను, డీవీ అండ్ ఏహెచ్ఓలను సంప్రదించాలి.

ఆర్థికాభివృద్ధే లక్ష్యం..

ఆదివాసీ గిరిజన రైతుల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచటానికి కేంద్రం ఈ పథకాన్ని అమలు చేస్తుంది. వారు స్వయం ఉపాధిని మెరుగుపరుచుకునేందుకు కేంద్రం ప్రోత్సహాన్నిస్తుంది. పోడుసాగుతో వచ్చే ఫలసాయంతో పాటుగా పశువుల పెంపకంపై కూడా కొంత ఆదాయం పెంచుకుని ఆర్థిక పురోగతి సాధించాలనే సంకల్పంతో కేంద్రం ఈ పథకాన్ని అమలు చేస్తుంది. ఈ పథకం కోసం పూర్తిస్థాయి వివరాల కోసం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో గాని, పశువైద్యశాలల్లో గాని సంప్రదించాలి. ఈ పథకంలో లబ్ధిపొందాలంటే ఎటువంటి మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా ప్రభుత్వ అధికారులను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తులు కూడా స్థానిక పశు వైద్యశాలల్లో అందుబాటులో ఉంచుతున్నారు.

క్లుప్తంగా

ఆదివాసీల హక్కులు ఉల్లంఘిస్తున్నారు..

చర్ల: ప్రపంచ వ్యాప్తంగా ఆదివాసీల హక్కులకు ఉల్లంఘన జరుగుతోందని, దీనిని నియంత్రించేందుకు ఏ ప్రభుత్వమూ చర్యలు తీసుకోవడం లేదని గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ ఆరోపించారు. ఆదివారం మండలంలోని సుబ్బంపేటలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. షెడ్యూల్డ్ ఏరియాల్లోని చట్టాలను అమలు చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించకుండా మొద్దు నిద్ర వహిస్తున్నాయని ఆయన అన్నారు. ఆదివాసీల చట్టాలు అమలయ్యి హక్కులు ఉల్లంఘన జరుగకుండా ఉండేందుకు ఆదివాసీలంతా ఐక్యం కావాలని ఆయన కోరారు. ఆగస్టు 9న జరిగే ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఆదివాసీలంతా చట్టాల అమలు దిశగా పోరాడుతూ నిర్వహించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో వర్కింగ్ ప్రెసిడెంట్ పూనెం వరప్రసాద్, నాయకులు ఇర్పా ప్రకాశ్, ఏకా సురేంద్ర, కాకా రాంబాబు, యాలం రమేష్, యాకా సూరిబాబు, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నూతన భవనం ఏర్పాటుకు కృషి



గ్రంథాలయ చైర్మన్‌ను సన్మానిస్తున్న మున్నూరుకాపు సంఘం నాయకులు

చంద్రుగొండ: గ్రంథాలయానికి నూతన భవనం నిర్మించేందుకు కృషి చేస్తానని జిల్లా గ్రంథాలయ చైర్మన్ పసుపులేటి వీరబాబు అన్నారు. గ్రంథాలయ జిల్లా చైర్మన్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఆయనను మున్నూరు కాపుం సఘం మండలశాఖ ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయ నూతన భవనం నిర్మాణం కోసం ప్రభుత్వం నుండి నిధులు మంజూరు చేయిస్తానన్నారు. కాపులు రాజకీయంగా ఎదగాలన్నారు. ఈ దిశగా అందరూ ఐక్యంగా ఉండి పార్టీల్లో రాణించాలన్నారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ ఏదైనా సరే ప్రాతినిధ్య వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల నాయకులు లంకా నర్సింహారావు, రామిశెట్టి సైదయ్య, వెలగల మధు, శెట్టిపల్లి కృష్ణయ్య, యాసం కాశీవిశ్వనాథ్, అంచ కృష్ణ, కూసాల లక్ష్మీపతి, ఆకుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఇంటర్నేషనల్ మూన్ డే



ప్రాజెక్ట్‌ను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

మణుగూరురూరల్: మండలంలోని సంతోష్‌నగర్‌లో ఉన్న ఎక్స్‌లెంట్ స్టార్ హైస్కూల్‌లో ఇంటర్నేషనల్ మూన్ డే కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా పలువురు విద్యార్థులు చంద్రుడు భూమి చుట్టూ తిరుగుతూ పరివర్తనం చెందే అంశంపై ప్రాజెక్ట్‌ను ప్రదర్శించగా.. మరికొంత మంది విద్యార్థులు నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ వేషధారణల్లో అలరించారు. కార్యక్రమంలో ఎక్స్‌లెంట్ విద్యాసంస్థల చైర్మన్ ఎండి.యూసఫ్ షరీఫ్, కరస్పాండెంట్ ఖాదర్, డైరెక్టర్ గబ్బర్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఇన్వర్టర్ వితరణ

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని శ్రీ శివ ముత్యాలమ్మ తల్లి గుడికి ఆదివారం ఒక భక్తుడు విద్యుత్ ఇన్వర్టర్‌ను వితరణగా ఇచ్చారు. పట్టణంలోని రామ్ దేవ్ మొబైల్స్ అధినేత లకారం సుమారు రూ.20 వేల విలువ గల విద్యుత్ ఇన్వర్టర్‌ను ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా దాత కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకుని మొక్కులను చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు ఉంగరాల వెంకట్రావు, తుమ్మలపల్లి దనేశ్వరరావు, పద్మనాభుని రవికుమార్, బోళ్ళ వెంకటరావు, గంగిరెడ్డి రమణారెడ్డి, పసుపులేటి వీరవెంకట సత్యనారాయణ, బండారు శరత్ బాబు, పిరంట్ల శ్రీకాంత్ రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, శ్రీధర్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

23న విద్యాసంస్థల బంద్

మణుగూరురూరల్: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 23వ తేదీన నిర్వహించనున్న విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్లకు నిర్వహించనున్న ఈ ధర్నాకు విద్యాసంస్థల యాజమాన్యాలు, విద్యార్థులు విజయవంతం చేయాలని కోరారు. నాయకులు ప్రణయ్‌కుమార్, మాదాసు అఖిల్, ఈనపల్లి పవన్‌సాయి, మనోజ్, అశ్వవర్ధన్, నవీన్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

సారపాకలో వనమహోత్సవం



జమాత్ హింద్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వన మహోత్సవం..

బూర్గంపాడు: జమాత్ ఈ ఇస్లామీ హింద్ (మహిళ విభాగం) ఆధ్వర్యంలో ఆదివారం సారపాకలో వన మహోత్సవ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో భాగంగా సారపాకలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జమాత్ ఈ ఇస్లామీ హింద్ ప్రతినిధులు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తప్పకుండా కనీసం ఒక మొక్కనాటి దానిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. తమ సంస్థ ఆధ్వర్యంలో పిల్లలు, మహిళలు ఈ కార్యక్రమాన్ని బాధ్యతయుతంగా చేపడుతున్నామన్నారు. మానవ మనుగడకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు రుబీనా, మస్రత్, రఫత్, వాసిఫా, పర్వీన్, రజియా బేగం తదితరులు పాల్గొన్నారు.

'స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటమి'

అశ్వారావుపేటరూరల్: ఎన్నికల హామీలు అమలు చేయకుండా మోసం చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు ఓడిస్తారని స్థానిక మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం మండలంలోని నారంవారిగూడెం కాలనీకు చెందిన (పలు పార్టీలకు చెందిన) 40 కుటుంబాలు మాజీ ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను ఎమ్మెల్యేగా పనిచేసిన కాలంలో అశ్వారావుపేట నియోజకవర్గ కేంద్రంతో పాటు, అన్ని మండలాల్లో కోట్లాది రూపాయల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టామని, కానీ ఈ అభివృద్ధి పనులను కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్నట్లు ఇటీవలే ఓ మంత్రి వ్యాఖ్యానించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రజలు అంతా గమనిస్తున్నారని అన్నారు. నాయకులు యూఎస్ ప్రకాశ్, మాజీ ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామమూర్తి, మందపాటి రాజమోహన్ రెడ్డి, సంపూర్ణ, నారం రాజశేఖర్, రాధ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నెలకొల్పుదాం



ర్యాలీ నిర్వహిస్తున్న ఎలక్ట్రీషియన్లు

చంద్రుగొండ: ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నెలకొల్పుదామని ప్రైవేటు ఎలక్ట్రీషియన్ల సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఆదివారం ప్రపంచ ప్లాస్టిక్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ ర్యాలీ చేశారు. ప్లాస్టిక్‌ని నిర్మూలిద్దామని, గుడ్డసంచులే వాడుదామని ప్రదర్శన కారులు నినాదాలు చేశారు.

బస్టాండ్ సెంటర్‌ను ప్రధాన సెంటర్‌మీదుగా పోలీస్‌స్టేషన్ వరకు ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు ఎస్‌కె.ఆసీఫ్, నాయకులు ఎస్‌కె.మస్తాన్, కాకటి రవిబాబు, ఐనోలు లక్ష్మణ్, విశ్రాత ఉపాధ్యాయుడు సుధాకర్ రావు పాల్గొన్నారు.

ఘనంగా బోనాల సంబురాలు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వినాయకపురం, కావడిగుండ్ల గ్రామాల్లో ఆదివారం ఘనంగా ఆషాఢ బోనాల సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, యువతులు కలిసి బోనాలను తలపై ఎత్తుకుని ప్రధాన వీధుల్లో మేళతాళాలతో ఊరేగింపుగా వెళ్లి చిలకలగండి ముత్యాలమ్మ తల్లి, గ్రామ దేవతలకు బోనాలను సమర్పించారు. అదేవిధంగా అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి పలు రకాల స్వీట్లు, పిండి వంటలు, పండ్లను నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో గ్రామాల్లో బోనాల సందడి నెలకొంది.

చంద్రుగొండ: మండలంలోని తిప్పనపల్లి గ్రామంలో ఆదివారం మహిళలు బోనమెత్తారు. తొలుత పవిత్ర స్నానాలు ఆచరించి బొడ్రాయి వద్ద మొక్కులు చెల్లించారు. మేళతాళాలు, బాజా భజంత్రీల నడుమ గ్రామ శివారులోని దేవతలకు మొక్కలు చెల్లించేందుకు ప్రదర్శనగా వెళ్లారు. పంటలు బాగా పండాలని, వర్షాలు సమృద్ధిగా పడాలని దేవతలను కోరుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు సంప్రదాయంగా మొక్కులు చెల్లించారు.

అన్నపురెడ్డిపల్లిలో..

ఆషాఢమాసాన్ని పురస్కరించుకుని అన్నపురెడ్డిపల్లిలోని అంకమ్మ దేవత ఆలయంలో మహిళలు పెద్ద ఎత్తున బోనాల పండుగ నిర్వహించారు. ఆలయ ప్రాంగణం నుంచి ప్రారంభమై గ్రామదేవతలకు మొక్కులు తీర్చుకున్నారు.



అన్నపురెడ్డిపల్లి: ప్రదర్శనగా వెళ్తున్న మహిళలు



అశ్వారావుపేటరూరల్: బోనాలతో మహిళలు, యువతులు

మండలంలో నేడు ఎమ్మెల్యే పర్యటన

దుమ్ముగూడెం: మండలంలో నేడు భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు పర్యటించనున్నారు. మండలంలోని చిన్న బండి రేవు, లక్ష్మీ నగరం గ్రామాల్లో వాటర్ ట్యాంక్ నిర్మాణానికి భూమి పూజ, కొత్త దంతనం, లచ్చిగూడెం, కోయ నర్సాపురంలో నూతనంగా నిర్మించిన పంచాయతీ భవనాలను ప్రారంభించనున్నట్టు అధికారులు తెలిపారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

అశ్వాపురం: మండల పరిధిలోని మిట్టగూడెం గ్రామానికి చెందిన సీపీఐ పార్టీ సీనియర్ నాయకుడు మండడపు వెంకటేశ్వరరావు ఇటీవల మృతి చెందగా ఆదివారం దశదిన కర్మ కార్యక్రమం నిర్వహించారు. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు దశ దినకర్మకు హాజరై వెంకటేశ్వరరావు చిత్రపటానికి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య, నాయకులు గాదె కేశవరెడ్డి, ఓరుగంటి రమేష్, కంసాని శేషయ్య, హర్ష, గొల్లపల్లి నరేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

యూటీఎఫ్ నాయకుడికి స్మారక స్తూపం



మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి

మణుగూరురూరల్: ఉపాధ్యాయుడిగా, ఉపాధ్యాయ సంఘ నాయకుడిగా నిట్టా రాంబాబు అందించిన సేవలు మరువలేనివని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి అన్నారు. మండల పరిధిలోని పగిడేరు గ్రామంలో స్వర్గీయులు నిట్టా రాంబాబు స్మారక స్తూపాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు, వారి కుటుంబాల సంక్షేమానికి యూటీఎఫ్ అనునిత్యం పాటుపడుతుందన్నారు. సంఘ సభ్యులలో ఎవరైనా మరణిస్తే వారి కుటుంబాలకు రూ.6లక్షలను ఫ్యామిలీ వెల్ఫేర్ ఫండ్ ద్వారా అందిస్తున్నామన్నారు. ఈ సహాయం వల్ల బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుండి బెనిఫిట్స్ వచ్చేంత వరకు భరోసాగా ఉంటుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాయులకు సంబంధించిన పదోన్నతులు, బదిలీల షెడ్యూల్‌ను వెంటనే విడుదల చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.రాజు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మురళీమోహన్, ఎం వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శులు తావూరియా, దాసు, రాము, రాంబాబు, రామానుజవరం కాంప్లెక్స్ హెచ్ఎం యశోద, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి ఐలయ్య, షేక్ మీరాహుస్సేన్, మహిళా అధ్యక్షురాలు తోట విజయలక్ష్మి, స్వరూపరాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు వితరణ

అశ్వారావుపేటరూరల్: మండలంలోని ఆసుపాక ప్రాథమికోన్నత పాఠశాల అభివృద్ధికి గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు ఆదివారం ఆర్థిక సాయం అందించారు. పాఠశాలలో కొద్దిరోజుల క్రితం బోరు ఏర్పాటు చేయగా, విద్యుత్తు మోటారు నుంచి మరుగుదొడ్ల వరకు పైపులైన్ ఏర్పాటు చేసేందుకు రూ.10వేల నగదును ప్రధానోపాధ్యాయిని విజయలక్ష్మికి నాయకులు ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కట్రం స్వామి, బిర్రం నరేష్, తాడేపల్లి నారాయణరావు, ఉప్పల సూరిబాబు, కొప్పుల సూరిబాబు తెలిపారు.

ట్రాలీపై మంచం.. దానిపై పిల్లలు



ట్రాలీ వాహనంపై ఏర్పాటు చేసిన మంచంలో చిన్నారులు

కరకగూడెం: ప్రయాణాలు చేసేటప్పుడు పెద్దవాళ్లు ఎలాగోలా సర్దుకుంటారు.. కానీ చిన్నపిల్లలకు ప్రశాంతమైన నిద్ర లేకపోతే ఇబ్బందికరంగా మారుతుంది. ఈ నేపథ్యంలో ఓ కుటుంబం దైవ దర్శనానికి వెళ్తున్న క్రమంలో తమ చిన్నారుల నిద్ర కోసం వినూత్న ఏర్పాటు చేసుకున్నారు. ఒక ట్రాలీ వాహనంలో ప్రయాణం చేస్తుండగా.. తమ చిన్నారులు నిద్రపోవడానికి సదరు ట్రాలీపై ఒక మంచాన్ని ఏర్పాటు చేశారు. దానిపై పిల్లలను పడుకోబెట్టి పక్కనే ఒకరు రక్షణగా కూర్చొని ప్రయాణం సాగించారు. ఆదివారం మండల కేంద్రంలో ఈ దృశ్యాన్ని 'సాక్షి' తన కెమెరాలో బంధించింది.

విద్యుత్ ప్రమాదాలతో జరభద్రం

- వర్షాకాలంలో అధిక ఘటనలు
- చేలల్లో రైతులకు అవగాహన అనివార్యం
- ఇళ్లల్లోనూ జాగ్రత్తలు సూచిస్తున్న నిపుణులు



ఓ వ్యవసాయ క్షేత్రం వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

మణుగూరురూరల్: వర్షాకాలం విద్యుత్‌తో అప్రమత్తత అవసరం. వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశాలు ఉంటాయి. అప్రమత్తంగా లేకపోతే చిన్న చిన్న పొరపాట్లతో విద్యుత్ ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుంది. ఇళ్ల వద్ద, పంట చేల వద్ద ప్రజలు, రైతులు జాగ్రత్తలు పాటించకపోతే నష్టాన్ని చవిచూడాల్సిందే. విద్యుత్ ప్రమాదాలపై ఆ శాఖ అధికారులు అవగాహన కల్పిస్తున్నప్పటికీ.. చిన్న చిన్న పొరపాట్లు చోటుచేసుకుని ఆస్తి నష్టంతో పాటు ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఉన్నాయి. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో రైతులు బోరుబావులు, వాగుల వద్ద మోటార్లు ఏర్పాటు చేసి పంట సాగు పనులు చేపడుతుంటారు. ఈ క్రమంలో రైతులు విద్యుత్ మోటర్లను వినియోగించేటప్పుడు జాగ్రత్తలు పాటించాల్సి ఉంది.

చిరు తప్పిదాలతో పెను ప్రమాదాలు

విద్యుత్ ప్రమాదాలపై ప్రజలకు, రైతులకు అవగాహన కల్పిస్తున్నప్పటికీ.. కొన్ని చిరు తప్పిదాల వల్ల పెను ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. వీటిపై ప్రజలు, రైతుల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉంది. రైతులు, ఇళ్లల్లో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చైతన్యం చేయాలి.

రైతులు పాటించాల్సిన జాగ్రత్తలు..

- రైతులు తమ పొలాలను సాగు చేసుకునేందుకు ఏర్పాటు చేసుకున్న విద్యుత్ మోటార్లలో ఏదైనా చిన్న చిన్న సమస్యలు తలెత్తితే వారే మరమ్మతులు చేసుకుంటారు. దీంతో ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉంది. ఇలా చేయకూడదు.
- విద్యుత్ మోటార్లు వాడేటప్పుడు ఒక ఫేజ్ కాలిపోతే మోటార్ మొత్తానికి విద్యుత్ ప్రవహిస్తుంది. ఆ సమయంలో మోటార్‌ను తాకకుండదం మంచిది.
- ట్రాన్స్‌ఫార్మర్‌లో ఏబీ స్విచ్ పూర్తిగా నిలిచిపోతే విద్యుత్ సరఫరా జరిగి ప్రమాదం జరిగే అవకాశం ఉంది. కాబట్టి ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేయాల్సి ఉంటుంది. ఈ సమయంలో రైతులు విద్యుత్ శాఖ సిబ్బందికి సమాచారం ఇవ్వాలి.
- మోటార్‌కు ఎర్తింగ్ తప్పనిసరి ఏర్పాటు చేసుకోవాలి. మోటార్‌ను పరీక్షించాలంటే టెస్టర్‌ను వినియోగించాలి. వర్షానికి మోటార్ తడవకుండా రేకు(గార్డ్)ను అమర్చుకోవాలి.
- పంట పొలాల వద్దనున్న ట్రాన్స్‌ఫార్మర్లు, స్టార్టర్ బాక్సుల చుట్టూ పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలి. తద్వారా పలు ప్రమాదాలను అరికట్టవచ్చు.
- స్టార్టర్లకు కవర్లను ఏర్పాటు చేసుకుని వాటిని రక్షించుకోవాలి. తెగిన విద్యుత్ తీగల పట్ల అప్రమత్తంగా ఉండాలి. అలాంటి ఉంటే వెంటనే విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వాలి. లేకుండా ప్రమాదాలు జరిగి ప్రాణనష్టం జరిగే అవకాశం ఉంటుంది.
- బోరుబావులు, వాగుల వద్దకు వెళ్లేటప్పుడు విద్యుత్ వైర్లను గమనించాలి. విద్యుత్ వైర్లు ఉన్నట్లయితే విద్యుత్ సరఫరాను నిలిపివేసిన తర్వాత అటువైపుగా వెళ్లాలి.

జాగ్రత్తలు తప్పనిసరి



విద్యుత్ ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు పాటించడం తప్పనిసరి. వర్షాకాలంలో ఇళ్ల గోడలు చెమ్మతో ఉండడం వల్ల విద్యుత్ సరఫరా జరిగే అవకాశం ఉంటుంది. మహిళలు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఇంట్లో ఎర్తింగ్ తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలి. రేకుల ఇళ్లకు విద్యుత్ తీగల తగలకుండా జాగ్రత్త పడాలి. అలాగే పంట పొలాల వద్ద రైతులు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్టార్టర్ బాక్సులు, విద్యుత్ మోటార్ల వద్దకు వెళ్లేటప్పుడు అత్యంత జాగ్రత్తగా ఉండాలి. విద్యుత్ సరఫరాలో ఏమైనా సమస్యలు తలెత్తితే స్వంతంగా కాకుండా సంబంధిత విద్యుత్ అధికారులను, సిబ్బందిని కానీ సమాచారం ఇవ్వాలి.

– ఉమారావు, ఇన్‌చార్జ్ ఏడీఈ, మణుగూరు